హరివిల్లు



హిందీమూలం: అజ్‌గర్ వజాహత్
తెలుగుసేత: డా. దేవరాజు మహారాజు

# చీమబలుడు

అనగా అనగా ఒకా నొక దేశంలో ఒక యోధు డుండేవాడు. అతనికి ఓటమి అంటే తెలియదు. అందువల్ల గర్వం, అహంభావం బాగా పెరిగాయి. అందరినీ చీమల్లా చూసేవాడు. ఒక రోజు అతణ్ణి ఒక యోగి కలిసి - "నీ కెందు కింత అహంభావం, నాయనా?" అని అడిగాడు.

"నాకు దీటైన వీరుడు ఈ ప్రపంచంలో మ రెవ్వరూ లేరు - అందుకే!" - అని యోధుడు మీసం మెలివేశాడు.

యోగి అందుకు ఒప్పుకోలేదు - "అందులో నిజం లేదు నాయనా!" అన్నాడు.

యోధుడికి కోపం వచ్చింది - "చెప్పండి చూద్దాం, నా బల పరాక్రమాలకు ఎదురొడ్డి నిలిచే వా రెవరో" అని హుంకరించాడు.

"ఒక చీమ చాలు నాయనా!" అన్నాడు యోగి.

ఆ మాట వినడంతోటే యోధుడు కోపోద్రేకంతో ఊగిపొయ్యాడు. వెంటనే చీమకోసం చుట్టూ చూశాడు. అతని గుర్రం మెడ మీద ఒక చీమ కనిపించింది. అక్కడి కక్కడే తన ప్రతాపం చూపించుకోవా లనుకున్నాడు. ఒరలోంచి కత్తి లాగాడు. చీమకు గురి చూసి ఒక్క వేటు వేశాడు. గుర్రం తల తెగి దొర్లుతూ పడిపోయింది. చీమకు ఏ హానీ కలుగలేదు. యోధుడు రెచ్చిపోయాడు. ఈసారి చీమ భూమిమీద పాకుతూ కనిపించింది. కత్తితో భూమిమీద బలంగా కొట్టాడు. దుమ్ము - మబ్బులు లేచాయి. చీమ ఎగిరి వచ్చి అతని ఎడమ చేతిమీద పడింది. చీమ చావనందుకు యోధుడు మండి పడ్డాడు. కత్తి పైకెత్తి ఈసారి తన ఎడమ చేతిమీది చీమకు గురి పెట్టాడు. కత్తి అతడి చేతిని ఖండిస్తూ దూసుకుపోయింది. ఆ విసురుకు చీమ ఎగిరి అతడి వక్షంపైన పడింది. ఆ పిచ్చి కోపంతోనే అతడు మరోసారి చీమను చంపే ప్రయత్నం చేశాడు.

యోగి ముందుకు దూకి - యోధుడి కుడి చెయ్యి పట్టుకున్నాడు. ఆత్మహత్య నుండి అతణ్ణి రక్షించాడు.

యోధుడు ఒక్క క్షణం ఊపిరి పీల్చుకున్నాడు - "నిజమే, స్వామీ! నా తప్పు తెలుసుకున్నాను. బలహీనులు - ఒక రకంగా బలవంతులకన్నా బలివంతులు!" అని కత్తి పడేసి నమస్కరించాడు.

హిందీ కథా రచయిత, అధ్యాపకుడు అజ్‌గర్ వజాహత్ 1946లో పుట్టాడు. ప్రస్తుతం ఢిల్లీలోని జామియా కళాశాలలో పని చేస్తున్నాడు. ఇటీవలే 'ఉర్దూ గజల్'పై ఒక మంచి డాక్యుమెంటరీ చిత్రం రూపొందించాడు. మూలం: యోధా.